పంచాయతీరాజ్ ఎఇ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - పెరవలి

మండలం మండల పరిషత్‌లో పంచాయతీరాజ్ ఎఇగా పనిచేస్తున్న కర్రి శ్రీరామచంద్రరెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన పెనుగొండ, తణుకు, పెరవలి మండలాల్లో 43 ఏళ్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రరెడ్డికి దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను ఎంపిడిఒ హిమమహేశ్వరి అందించారు. ఆయన సేవలను కొనియాడారు. పలువురు సిబ్బంది ఆయనకు పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సింగంశెట్టి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల పరిషత్ సిబ్బంది, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల్లో రాజులోవ కీలక పాత్ర

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు
- ఉద్యమ సహచరుడిని కోల్పోయాం : వక్తల ఆవేదన.
- భావోద్వేగ భరితంగా సంస్మరణ సభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గత రెండు దశాబ్ధాలుగా జరిగిన ప్రజా ఉద్యమాల్లో రాజులోవ కీలకపాత్ర పోషించారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరం నగరంలోని విక్రమ హాల్‌లో ఇటీవల మరణించిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. తొలుత రాజులోవ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ అధ్యక్షత సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈనాటి యువత అనుసరిస్తున్న కెరీరిజం విధానానికి భిన్నంగా సోషలిజమే ప్రత్యామ్నాయమని నమ్మిన రాజులోవ పూర్తికాలం కార్యకర్తగా విశేష కృషి చేశారని అన్నారు. రాజులోవ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్నవయస్సులోనే రాజులోవ భౌతికంగా దూరమవటం దురదష్టకరమన్నారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు బేబిరాణి మాట్లాడుతూ కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజాఉద్యమాల్లో పనిచేస్తున్న కార్యకర్తలందరికీ ఉద్యమ సహచరులే తోబుట్టువులన్నారు. అటువంటి వారు దూరమైన బాధ మాటల్లో చెప్పలేనిదన్నారు. ఉద్యమంవైపు పయనం ముళ్లబాట అని, రాజులోవ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు మాట్లాడుతూ పలు ఉద్యమాల్లో రాజులోవతో కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నారు. రాజులోవ మరణం తనను వ్యక్తిగ తంగా కలిచివేసిందన్నారు. సభాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ రాజులోవతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, తన సూచనలతో పూర్తి కాలం కార్యకర్తగా మారారన్నారు. రాజులోవ మరణం తనను తీవ్రంగా కలచివేసిందని భావో ద్వేగానికి లోనయ్యారు. కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ రాజులోవ మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటు అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సిఐటియు నాయకులు కృష్ణవేణి మాట్లాడుతూ ఎప్పుడూ చిరునవ్వుతో పలుకరించే రాజులోవ భౌతికంగా లేకపోవడం ప్రజా ఉద్యమానికి తీరని నష్టమన్నారు. అనంతరం యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి, ఐఎఫ్‌టియు నాయకులు జోజి, సిఐటియు రంపచోడవరం కార్యదర్శి పి.వెంకట్, మహిళా సంఘం సీనియర్ నాయకులు సావిత్రి, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, సిపిఎం నగర కార్యదర్శి బి. పవన్, ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా తదితరులు మాట్లాడారు. సిపిఎం సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, ఐద్వా నాయకులు తులసి, కెవిపిఎస్ నాయకులు జె.రాంబాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సుందరబాబు, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు రాజులోవ అందించిన సేవలను గుర్తు చేస్తూ ఆలపించిన గీతాలు విన్న కార్యకర్తల కళ్లు చెమర్చాయి.

రాజులోవకు సంతాపం తెలుపుతున్న నాయకులు

రాజులోవ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, ఎవి.నాగేశ్వరరావు, టి.మధు, టి.అరుణ్

సభకు హాజరైన ప్రజా, కార్మిక,విద్యార్థి సంఘాల నాయకులు, కార్మికులు

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ఉపాధి కూలీలకు రూ.300 వేతనం ఇవ్వాలి

వ్యకాసం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పథకంలో వేతనదారుల సమస్యలను పరిష్కరించి ప్రతి కార్మికునికీ రూ.300 కనీస వేతనం వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మండలంలోని చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, పాత కోరంగి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు, దుప్పి అదష్టదీపుడు, ఎం.తణుకు రాజుతో కలిసి సుబ్బారావు కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీ సంఘాల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం 2014 నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం వచ్చినప్పుడు బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ, పొమ్మనకుండా పొగ పెట్టే పద్ధతిలో ఈ ఉపాధి పథకాన్ని రద్దు చేయాలని కుట్రతో పనిచేస్తూ ఉందని అన్నారు. గతంలో ఇచ్చిన సౌకర్యాలైన మెడికల్ కిట్లు, టెంట్లు, మంచినీళ్లకు డబ్బాలు మేట్లకు పారితోషికాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశంలో అంబానీ, ఆదానిలాంటి కోటీశ్వరులకు వేలకోట్ల రూపాయలు అప్పనంగా కట్టబెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కష్టజీవులకు రూ.300 లు ఇవ్వడానికి మనసు లేదన్నారు. ఈ పరిస్థితులను కూలీలందరూ అర్థం చేసుకుని భవిష్యత్తులో బలమైన పోరాటాలు నిర్వహించి మన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు పింఛన్ల పంపిణీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జూన్ 1వ తేదీన సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కోసం అధికార యంత్రాంగం సమగ్రమైన ఏర్పాట్లను చేసిందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో జూన్ నెలకు సంబంధించి 2,42,300 మంది సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కోసం రు.71.92 కోట్ల మేర చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వికలాంగులు, అనారోగ్య కారణాల రీత్యా బెడ్ రీడన్, సైనిక కుటుంబాల తదితర ప్రత్యేక కేటగిరి కింద గుర్తించిన 71,232 మందికి రూ.19 కోట్ల 57 లక్షల 41 వేలు ఇంటికే వెళ్లి పంపిణీ చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన 1,71,068 మందికి రూ.52 కోట్ల 35 లక్షల 76 వేలను నేరుగా నగదు బదలీ (డిబిటీ) ద్వారా ఆయా పెన్షన్ దారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. నేరుగా పెన్షన్ దారుల ఖాతాలో జమ చేసినా పెన్షన్ మొత్తం డిజిటల్ మోడ్, బ్యాంకు కలెక్షన్ సెంటర్, ఎటిఎంల ద్వారా నగదును తీసుకోవచ్చన్నారు. బ్యాంకులకు వెళ్లి నేరుగా డ్రా చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆ మేరకు బ్యాంకర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎమ్‌ల ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. ఎవ్వరూ పెన్షన్ల కోసం సచివాలయాలకు వెళ్లరాదన్నారు. క్షేత్ర స్థాయిలో ఆమేరకు నగపాలక సంస్థ మునిసిపల్ కమిషనర్, మండల అభివృద్ధి అధికారులు, పురపాలక సంఘాల కమిషనర్లు, డివిజనల్ అభివృద్ధి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ఆదేశించామన్నారు.

కోతలు నివారించాలి

గోకవరం : మండలంలో కరెంటు కోతల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎఇ అశోక్ దృష్టికి టిడిపి మాజీ జడ్‌పిటిసి డాక్టర్ పాలూరి బోసుబాబు తీసుకువెళ్లారు. శుక్రవారం ఆయన ఎఇని కలిశారు. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. పగలు రాత్రి తేడా లేకుండా గంటల తరబడి కరెంటు కష్టాలను ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారు. చిన్నారులు, వృద్ధులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు కంటిపై కునుకు కరువైందన్నారు. ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవాలని బోస్ డిమాండ్ చేశారు. దీనిపై ఎఇ సానుకూలంగా స్పందించారు. ఇబ్బంది లేకుండా కరెంటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నలమహారాజు తదితరులు ఉన్నారు.

క్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి

ప్రజాశక్తి - కడియం

క్రీస్తు బోధనలు ఆచరించడం ద్వారా ప్రపంచ మానవాళికి శాంతి చేకూరుతుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. మండలంలోని వేమగిరి తోటలో పెంతుకోస్తు ప్రార్థన మందిరం 25వ వార్షికో త్సవం సందర్భంగా నిర్వహించిన మహాసభలు శుక్రవారంతో ముగిశాయి. పి.ప్రసాద్ ఆధ్వ ర్యంలో పలువురు సందేశాలను అందించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ గోరంట్ల హాజరై మాట్లాడారు. అనంతరం టిడిపి నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ సమకూర్చిన దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి, చెల్లుబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.మణికృష్ణ, వి.నాగ బాబు, గుత్తుల ముత్యం పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామంలో యాదవోలు రోడ్డు ,చంద్రబాబు నాయుడు కాలనీలో రెండు రోజులుగా కరెంటు కోతలతో కాలనీవాసులు ఇక్కట్లు పడుతున్నారు. దీంతో ప్రజలు విద్యుత్ ఉపకేంద్రం వద్ద శు క్రవారం ధర్నాకు దిగారు. 20 హెచ్‌పి హార్స్ పవర్ సామర్థ్యం కలిగిన వైర్లను కాలనీలో విద్యుత్ అందించాల్సిన ఇళ్లకు వేస్తే ఎక్కడ ఆగుతాయని ప్రశ్నించారు. అలాగే నాసిరకం వైర్లను వాడటంతో వైర్లు వేడికి కరిగిపోయి మంటలు రేగుతున్నాయన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ ఎఇ దృష్టికి తీసుకెళ్లినా నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నార. కరెంటు సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల ఇళ్లలోని గృహోపకరణాలు పనిచేయక నాన ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత రాత్రి సుమారు 12 గంటల సమయంలో విద్యుత్తు హెచ్చుతగ్గుల వల్ల వైర్లు కాలిపోయాయన్నారు. ఇవి తెగిపడి పక్కనే ఉన్న పూరి గుడిసెపై పడి ఉంటే పెను ప్రమాదం జరిగేదన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం కూడా జరిగే ప్రమాదం ఉండేదన్నారు. వెంటనే గుర్తించడం వల్ల పెను ప్రమాదం నుంచి బయటపడ్డామన్నారు. వేసవి కారణంగా ఎండల తీవ్రతతో ఉక్కబోతలతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు లోవోల్టేజ్ కారణంగా విద్యుత్ సరిగా ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై స్థానిక విద్యుత్ లైన్‌మేన్‌లను అడగగా తూతూ మంత్రంగా కండక్టర్లు మారుస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపించడం లేదన్నారు. వారు సమయానికి అందుబాటులో కూడా ఉండట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ ఎఇ డి.రవిశంకర్ ప్రజలతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

జిల్లాలో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పొగాకుకు దూరంగా ఉండాలని పలువురు వైద్యులు పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవాన్ని జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు, అవగాహనా సమావేశాలను నిర్వహించారు. రాజమహేంద్రవరంలో ర్యాలీనినిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ ఏడాది 'పొగాకుకు వీడ్కోలు - ఆరోగ్యానికి స్వాగతం' థీమ్‌తో పొగాకు నిరోధక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పొగాకు వల్ల పలు దుష్ప్రభావాలు ఉన్నాయన్నారు. ఊపిరితిత్తులు, నోరు, గొంతు, ఆమాశయం, మూత్రపిండాలు వంటి అనేక అవయవాలకు కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. గుండె సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఊపిరితిత్తుల కేన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వస్తాయన్నారు. సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుందన్నారు. మధుమేహం, నాడీ సంబంధిత సమస్యలు, చర్మ సంబంధిత సమస్యలు, కొన్ని పరిస్థితుల్లో బ్రెయిన్‌స్ట్రోక్ కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా ఎపిడిమియలజిస్ట్ సుధీర్‌బాబు మాటాడుతూ జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో ధూమపాతం చేస్తే జరిమానా, జైలు శిక్ష తప్పదన్నారు. రాజమహేంద్రవరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో గల పొగాకు నిరోధక కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కేంద్రాల్లో పొగాకు వాడకాన్ని మాన్పడానికి వ్యక్తిగత సలహాలు, మార్గదర్శకాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ నేతల రాజకుమారి, జిల్లా ఎన్‌సిడి ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, సోషల్ వర్కర్ మెండి అర్జున్‌రావు , సైకాలజియిస్ట్ బడుగు రాజు, సూపర్‌వైజర్లు అలీ బేగ్, ఆశాలు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో...

దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. డివిజనల్ మెడికల్ ఆఫీసర్ వెంకమాంబ ఆధ్వర్యంలో శాంతి యాత్రను నిర్వహించారు. ధూమపాన నిషేధంపై రైల్వే ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్స్ సమక్షంలో ర్యాలీ జరిగింది.

రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కౌంటింగ్‌కు రూట్ మ్యాప్‌ల పరిశీలన

ప్రజాశక్తి - రాజానగరం

కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఇవిఎం యూనిట్స్ తీసుకుని రావడం కోసం రూట్ మ్యాప్‌లన్నీ పూర్తయ్యాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఎస్‌పి పి.జగదీష్, జెసి ఎన్.తేజ్‌భరత్‌తో కలిసి నన్నయ్య యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ హల్ సీసీ కెమెరాలు మార్గాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ మొత్తం ఇవిఎం ఓట్లు లెక్కింపునకు పార్లమెంట్ స్థానానికి 98 టేబుల్స్ 116 రౌండ్స్, అసెంబ్లీ నియోజక వర్గానికి 98 టేబుల్స్ 116 రౌండ్స్ మేరకు ఏర్పాటు చేశామన్నారు. ఇటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, సహాయకులు ఉంటారన్నారు. కౌంటింగ్ ప్రక్రియను మైక్రో అబ్జర్వర్స్ నిశితంగా పరిశీలిస్తారన్నారు. తగిన గుర్తింపు కార్డులు లేని వారిని అనుమతించబోమని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు తరపున జూన్ 4న ప్రతిపాదించు కౌంటింగ్ ఏజెంట్స్ వివరాలను ఇప్పటికే కోరామన్నారు. దీనిపై భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఇవిఎం యూనిట్స్ తీసుకొచ్చే వారికి నియోజకవర్గాల వారీగా డ్రెస్ కలర్ కోడ్ ఇస్తూ, అసెంబ్లీకి, పార్లమెంటు వివరాలు ముద్రించనున్నట్లు తెలిపారు. వారి వెంట అదనపు ఎస్‌పి ఎల్.చెంచురెడ్డి, ఆర్‌డిఒ చైత్ర వర్షిణి, తదితరులు ఉన్నారు.

ఎండలతో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - వాగల్లు

భానుడు భగభగలతో జనం విలవిల్లాడుతున్నారు. మూడు రోజుల నుంచి మండుతున్న ఎండలతో ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 8గంటలకు కూడా వేడిగాలులు వీచాయి. రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు.గతంలోఉన్న చెరువులు పూడ్చేయడం, చెట్లు నరికివేయడం, వాహనాల పెరుగుదలతో అధిక ఉష్ణోగ్రతలునమోదవుతున్నాయని స్థానికులు తెలిపారు.

కార్టూ'నిజం'



కొండవీటిలో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య, మధ్య తరగతి విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన, ఉన్నత ఆశయాలే లక్ష్యంగా నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కొండవీటి విద్యా సంస్థలు ఆశయమని విద్యాసంస్థల సెక్రెటరీ, కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం తెలిపారు. గోపాలపురంలో 2001లో స్థాపించిన శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నత స్థాయి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. 2014లో కొండవీటి డిగ్రీ కళాశాల, కొండవీటి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రారంభించిన నాటి నుంచి యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నట్టు చెప్పారు. 2022లో కొండవీటి నర్సింగ్ కళాశాలను స్థాపించామన్నారు. తమ సంస్థల ఆధ్వర్యంలో శ్రీ గౌతమి జూనియర్ కళాశాల, కొండవీటి డిగ్రీ కళాశాలలో ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి, సిఇసిలో పాటూ ఒకేషనల్ కోర్సులు ఎంపిహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) ఎంఎల్‌టి, డిగ్రీలో బిఎస్‌సి హానర్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎ స్పెషల్ తెలుగు, పొలిటికల్ సైన్స్, జిఎన్ఎం నర్సింగ్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.





గోపాలపురం మండల పరిసర ప్రాంతాలలో విద్యార్థులు దూర ప్రాంతాలలోని పట్టణాలకు వెళ్లే అవసరత లేకుండా వారి కలలు సాకారం చేసేందుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనుభవజ్ఞులైన ఉత్తమ అధ్యాపకులతో కార్పొరేట్‌కు ధీటుగా ఒత్తిడి లేని విద్యను అందించడం తమ విద్యాసంస్థల ప్రత్యేకత అని అన్నారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని వివరాల కొరకు పనివేళలో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కళాశాల ప్రత్యేకతలు

విశాలమైన తరగతి గదులు
విద్యార్థులకు అత్యాధునిక ల్యాబులు
కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ
ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ సదుపాయం
నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణ
విశాలవంతమైన క్రీడప్రాంగణం
వ్యాయామ ఉపాధ్యాయులలతో క్రీడల్లో శిక్షణ
బాలురకు, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం
విద్యావంతులైన వార్డెన్‌లతో స్టడీ అవర్స్ నిర్వహణ
ప్రతిరోజూ ఒక్కొక్క సబ్జెక్టుపై పరీక్షల నిర్వహణ

సాధించిన విజయాలు

అండర్-19 ఫుట్‌బాల్ విభాగంలో జిల్లా స్థాయిలో అర్హత సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
ఎపి పీజీ సెట్- 2023 ఫలితాల్లో 100లోపు నాలుగు ర్యాంకులు కైవశం. గొల్ల కావ్య సైకాలజీ విభాగంలో 25 ర్యాంకు, ముప్పిడి శాంతిప్రియ గణిత విభాగంలో 74 వ ర్యాంకు, తాడేపల్లి రాణి తెలుగు విభాగంలో 93వ ర్యాంక్, కొడమంచిలి సుమ కామర్స్ విభాగంలో 94వ ర్యాంకు
కొండవీటి విద్యాసంస్థలు కళాశాలలో విద్యనభ్యసించిన అత్యధిక విద్యార్థులు ప్రభుత్వ శాఖలో ఉన్నతమైన ఉద్యోగాలు సాధించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, పలు ప్రముఖ సంస్థల్లో స్థిరపడ్డారు.

నేరాలు ఘోరాలు

సూరిబాబు, సాయిబాబు మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-ఆలమూరు

జొన్నాడ-మండపేట ఆర్ అండ్‌బి రోడ్డుపై మండలంలోని గుమ్మిలేరు సమీపంలో శుక్రవారం ఉదయం బొలెరో వ్యాన్‌ను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు బొలెరో వాహనంలో తుంగపాడు చెరువుల వద్దకు చేపల వేటకు బయలుదేరారన్నారు. ఈ క్రమంలో గుమ్మిలేరు జయలక్ష్మి రైస్ మిల్ సమీపానికి వచ్చేసరికి మండపేట పౌరసరఫరాల గోదాముల నుంచి బియ్యం తరలిస్తున్న ట్రాక్టర్ డ్రయివర్ నిర్లక్ష్యంగా ఎదురుగా వస్తున్న మత్స్యకారుల వాహనాన్ని ఢీకొట్టిందన్నారు. దీంతో బోలెరో వాహనం వెనుక బాగాన ఉన్న లంకే సూరిబాబు(49), వనమూడి సాయిబాబు(62)లకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. అయితే అదే వాహనంలో ప్రయాణిస్తున్న మిగిలిన ముగ్గురు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. వారిని వైద్య సేవల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అలాగే ఇద్దరి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం స్థానికుల సహకారంతో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించమన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై ఆలమూరు మత్స్యకారుల కాలనీ మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల రోదనతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

కుక్కల దాడిలో విద్యార్థికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

గాయపడిన భీమేష్

మండలంలోని ద్రాక్షారామ గ్రామానికి చెందిన బియ్యం పేటలో నాలుగో తరగతి విద్యార్థి కె.సత్య భీమేష్‌ను శుక్రవారం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు వెంటనే ద్రాక్షారామ పిహెచ్‌సికి విద్యార్థిని తరలించి వైద్యం అందజేశారు. కాగా బియ్యం పేటలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగి స్వైర విహారం చేస్తున్నాయని వీటిని అరికట్టాలని బియ్యం పేట గ్రామస్తులు ద్రాక్షారం పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

రాళ్లు ఢీ కొట్టిన బోటు

లంగరు తాడు తెగి బోటు ధ్వంసం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

లంగరు తాడు తెగి ఉప్పుటేరు వద్ద ఉన్న రాళ్లు ఢీకొని బోటు ధ్వంసమైనట్లు బోటు మత్స్యకారులు తెలిపారు. వేట నిషేధ సమయం కావడంతో రామన్నపాలెం ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద మత్స్యకారులు బోట్లకు లంగరు తాళ్లు కట్టి నిలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఉప్పాడకు చెందిన ఉమ్మిడి జగన్నాథంకు చెందిన బోటుకు ఉన్న తాడు తెగిపోవడంతో పక్కనే ఉన్న రాళ్ల గుట్టను ఢీ కొట్టింది. దీంతో బోటు అడుగుభాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు జగన్నాథం తెలిపారు.

అన్యాయం చేశారని బాధితుని ఫిర్యాదు

ప్రజాశక్తి - యానాం

స్థానిక దొమ్మేటిపేట సమీపంలో సుమారు 5 ఎకరాల భూమికి సంబంధించి సంబంధిత యజమానులు తనకు నాలుగేళ్ల క్రితం అగ్రిమెంట్ రాస్తామని చెప్పి మోసం చేశారని నల్లా వెంకటేశ్వరరావు పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో సిఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం, డిప్యూటీ తహశీల్దార్ దండయుతపాణి, భూమికి సంబంధించి వివాదం ఉండటంతో చెరువు పనులు తక్షణం నిలుపుదలచేయాలని ఆదేశించారు.

ప్రసాద్ సేవలు ప్రశంసనీయం:కమిషనర్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర్ పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ పిఎస్ఎస్‌విఎస్.ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని కమిషనర్ కె.శివప్రసాద్ ప్రశంసించారు. ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా వారి దంపతులను నగర పంచాయతీ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాద్ పనిచేసిన ప్రతి చోటా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో మంచి సంబంధ బాంధవ్యాలు కొనసాగించి వృత్తిలో మంచి పేరు పొందారన్నారు. ప్రతి ఒక్క సిబ్బంది ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కె.శ్రీనివాసరావు, టిపిఒ జెడి ఆనంద్ కుమార్, ఎఇ అనూష, నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ కమిషనర్ కె.పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం దోమల నిర్మూలనపై వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ ఇంటి లోపల, ఇంటి బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమలు ఉత్పత్తి కాకుండా నిరోధించవచ్చన్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు మాట్లాడుతూ ఇంటి పనిలో వినియోగించే అనేక పాత్రలలో నీటిని వదిలేస్తారని, రోజుల తరబడి ఈ నీటి నిల్వల వల్ల దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. దోమల వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడతారన్నారు. ముఖ్యంగా పిల్లలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థినికి రోటరీ క్లబ్ సైకిల్ అందజేత

ప్రజాశక్తి -కరప

సైకిల్ అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వేళంగి గ్రామం నర్లాస్ జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినికు రోటరీక్లబ్ వారు ప్రోత్సాహంగా సైకిల్ ఉచితంగా అందించినట్లు తెలిపారు. గంధం ఝాన్సీ సత్యశ్రీ చదువులో మంచి ఫలితాలు సాధిస్తుండడంతో ఆమె చదువుకు ఆర్థికంగా వెనకబడి ఉండడంతో వేళంగి గ్రామవాసి శాఖ శ్రీను ఝాన్సీ పరిస్థితిని కరప మాజీ సర్పంచ్ తాతీలు రోటరీ క్లబ్ దష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి ఝాన్సీకి లేడీ బర్డ్ సైకిల్‌ను ఉచితంగా అందించినట్లు శ్రీను, తాతీలు తెలిపారు.

గ్రాట్యుటీ ద్వారానే ఎల్ఐసి ఏజెంట్‌కు గుర్తింపు

ప్రజాశక్తి-పిఠాపురం

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) సంస్థ ఏజెంట్‌గా చేరి గ్రాట్యుటీ పొందడం ద్వారా తగిన గుర్తింపు వస్తుందని ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ జూపూడి రాము అన్నారు. శుక్రవారం ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో డి.మహేశ్వరులు, పి.వీరబ్బారెడ్డికి గ్రాడ్యుటీ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్ వృత్తి ఎంతో సేవాభావం కలిగి ఉందని, ప్రతి ఒక్క ఎల్ఐసి ఏజెంట్ ప్రతి కుటుంబానికి రక్షణగా జీవిత బీమా పాలసీ అందించి అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తూ ఉంటారని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఈనిల్ కుమార్, ఎలాకారెడ్డి రామకష్ణ, పవళిక పత్తి ప్రసాద్, చాముండేశ్వరి, పావని పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివి

పెద్దాపురం : పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయ సూపరింటెండెంట్‌గాఉద్యోగ విరమణ చేసిన కె.సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని ఆర్‌డిఒ సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. సుబ్రహ్మణ్యం 38 ఏళ్ల పాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో అత్యుత్తమ సేవలు అందించారన్నారు. ఉన్నత విలువలతో ఆయన ఎన్నో అవార్డులు అందుకున్నారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన సుబ్రహ్మణ్యంను పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రమణి సుబ్రహ్మణ్యం, తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, డిటి భాను కుమార్, ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సినీ డైరెక్టర్ బుచ్చిబాబుకు పితృవియోగం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఉప్పెన సినిమా డైరెక్టర్ సానా బుచ్చిబాబు తండ్రి వెంకట్రావు అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలం నుంచి ఆయన హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అంత్యక్రియల నిమిత్తం ఆయన భౌతిక కాయాన్ని శుక్రవారం స్వగ్రామమైన యు.కొత్తపల్లి మండలం కొత్తపల్లికి తీసుకు వచ్చారు. అంత్యక్రియలకు బుచ్చిబాబు గురువు ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ హాజరయ్యారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న డైరెక్టర్ సుకుమార్

రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానంపై అపోహలు వీడండి

ప్రజాశక్తి-కాకినాడ

రక్తదానంపై అపోహలు వీడి యువతీ యువకులు ప్రతి 90 రోజులకూ ఒకసారి రక్తదానం చెయ్యొచ్చని చేయూత సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మొండి రవి కుమార్, అలీమ్ అన్నారు. చేయూత సంస్థ సభ్యుడు చింతా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, చేయూత సభ్యులు అభయ బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 35 మందికి పైగా యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినరోజులు, పెళ్ళిరోజులు లాంటి వేడుకలను ఆడంబరంగా నిర్వహించుకోవడం కంటే సమాజానికి ఉపయోగపడే విధంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందదాయకమని పవన్ కళ్యాణ్, అతని మిత్ర బృందాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చింతా నారాయణ మూర్తి, తేజస్విని, అంగడ లక్ష్మి, అజహర్, గణ ప్రసాద్, రాజేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

శాంతి భద్రతల రక్షణకు పోలీసుల చర్యలు

ప్రజాశక్తి -కరప

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం కరప మండలంలోని ఆయా పార్టీల నాయకులకు నోటీసులు అందించారు. మే 6 వరకు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున సమావేశాలు ఏర్పాటు చేయడం, ప్రజలను రెచ్చగొట్టే చర్యలు, ఊరేగింపులు వంటి కార్యకలాపాలు జరగకుండా నాయకులకు ముందస్తు నోటీసులు అందించామని ఎస్ఐ తెలిపారు. కరపలో టిడిపి నాయకులు దేవు వెంకన్న, జనసేన నాయకులు భోగిరెడ్డి గంగాధర్‌కు నోటీసులు అందించినట్టు

మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట నంబర్-2 మార్కెట్ వద్ద శుక్రవారం శ్రీనివాస చికెన్ సెంటర్ అధినేత పైల వీరబాబు ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ 150 లీటర్ల పెరుగుతో తయారు చేసిన మజ్జిగను పంపిణీ చేసి పాధచారులకు పంపిణీ చేశారు. అధిక ఎండలు, ఉష్ణోగ్రతలు పెరిగి తీవ్ర వడగాల్పులలో సైతం వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తున్న వాహనదారులు, ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీని వీరబాబు తన అనుచరులతో చేపట్టి సేవలనందించారు.

యానాం వార్తలు

ఆర్‌ఎఒతో ఎంఎల్ఎ అశోక్ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్ఎఒ మునిస్వామితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నియోజవర్గంలో ఉన్న పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాలని, నూతన వివాహం చేసుకున్న దంపతులకు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా అందజేసే నగదును త్వరితంగా చెల్లించాలని సూచించారు. రవాణా శాఖకు సంబంధించి బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ను శాశ్వతంగా నియమించాలని కోరారు. ఇప్పటికే ఎంఎల్ఎ నిధుల నుంచి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. కానీ అక్కడ పనులు మాత్రం మందకోడిగా సాగుతున్నాయని సంబంధిత శాఖల ద్వారా పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. విద్యార్థులకు అవసరమయ్యే సర్టిఫికెట్ల జారీ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే ధ్రువపత్రాలు త్వరగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, డిప్యూటీ తాసిల్దార్ దండయపాణి పాల్గొన్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

జన విజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మెట్టకూరు మదర్ థెరిస్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలల వేసవి వినోద కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యానాం కమిటీ గౌరవాధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు మాట్లాడుతూ పిల్లలకు వేసవి సెలవుల్లో వినోదంతో కూడిన విజ్ఞానం అందించడమే వేసవి వినోద కేంద్రం ముఖ్య ఉద్దేశన్నారు. జ్యోతిష్యం, మంత్రాలు బూటకమని వాటిని నమ్మి మోసపోవద్దని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజా మొహిద్దీన్ సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవిపి.సత్యనారాయణ మాట్లాడుతూ వేసవి వినోద కేంద్రాన్ని ఉదయం 8 నుంచి 11 వరకు, జూన్ 5 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇంద్రజాలకుడు ఎం.పాపారావు అనేక అంశాలు ప్రదర్శించి వీటిలో మంత్రాలు ఏమీలేవు హస్తలాఘవం మాత్రమేనని, ప్రతిదానికీ సైంటిఫిక్ రీజన్ ఉంటుందని అన్నారు. ప్రదర్శనలను విద్యార్థులు కేరింతలతో తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పివి రమణ జన విజ్ఞాన వేదిక, ప్రజా సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాం కమిటీ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు, జిల్లా నాయకుడు కెవి.రమణ, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీరామ్, ప్రజా సంఘాల నాయకులు జి.దుర్గాప్రసాద్, కుంచే సత్యనారాయణ, టి.శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా పేకాట క్లబ్‌లు

ప్రజాశక్తి - యానాం

యానాంలో నిబంధనలకు విరుద్ధంగా పేకాట క్లబ్‌లు యథేచ్ఛగా సాగుతున్నాయని, దీనిపై అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు దగ్గరలో ఉన్న గుడ్ లక్ రిక్రియేషన్ అండ్ కల్చరల్ అసోషియేషన్ పేరు మీద నిబంధనలకు విరుద్ధంగా పేకాటక్లబ్ కార్యకలాపాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానిక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు తూతూ మంత్రంగా అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూతబడిన పద్మాబాలజీ రైస్ మిల్లులో రీ క్రియేషన్ క్లబ్‌కు అనుమతి లేదని యానాం ప్లానింగ్ అథారిటీ మెంబర్ సెక్రటరీ నాయక్ నోటీసులో పేర్కొన్నారు. సూర్యసొసైటీ ఫర్ సోషల్ వెల్ఫేర్ సంస్థకు సైతం నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించాలని విద్యుత్ ఎఇ, రిక్రియేషన్ కార్యాకలాపాలు నిలుపుదల చేయాలని ఎస్ఐకు, ఎన్ఒసి జారీ చేయవద్దని మున్సిపల్ కమిషనర్‌కు పంపినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

వేసవిలో మారుమూల ప్రాంతాలకు సైతం తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. నగర పంచాయతీ కార్యాలయం సమావేశపు హాలులో నందు శుక్రవారం ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. .ఈ సమావేశంలో 3 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టి చర్చించారు. కౌన్సిల్ సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కౌన్సిల్ సమావేశంలో కేవలం మంచినీటి సరఫరా మరియు శానిటేషన్ నిర్వహణకు సంబంధించి చేపట్టవలసిన చర్యలు, వాటి నిర్వహణ ఖర్చులకు నిధులు మంజూరు వంటి అంశాల పై చర్చించి సమావేశాన్ని సాదాసీదాగా ముగించారు. ప్రత్యేక శానిటేషన్ నిర్వహణకు అవసరమయ్యే బ్లీచింగ్, క్రిమిసంహారక మందులు కొనుగోలుతో పాటు ముగ్గు కొనుగోలుకు అవసరమైన కన్జర్వెన్సీ సామగ్రి కొనుగోలుకు సుమారు రూ.రెండు లక్షలు, మంచినీటి సరఫరాకు సంబంధించి 20 వార్డులో పైపులైన్లు మెయింటినెన్స్, పంపులు, మోటర్లు మరియు పైపులు లీకేజీలు వంటి వాటికోసం మరో రూ.లక్ష నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశానికి ముందు 4వ వార్డ్ కౌన్సిలర్ అమలదాసు శ్రీనివాస్ భార్య వెంకటలక్ష్మి(వార్డు వాలంటీర్) అకాల మతికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి, వైస్ ఛైర్మన్ వేటుకూరు బోసురాజు, కౌన్సిలర్లు నగర పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు మరియు వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం కౌన్సిల్ సమావేశం

పోరాట యోధులు దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

స్వాతంత్ర్య సమరయోధులు, సమాజ సేవకులు దువ్వూరి సుబ్బమ్మ 60 వ వర్ధంతిని శుక్రవారం ద్రాక్షారామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి నియోజకవర్గ మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్ళిన తొలి ఆంధ్ర మహిళ దువ్వూరి సుబ్బమ్మ అని కొనియాడారు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సుబ్బమ్మ స్త్రీ జనోద్ధరణకు కషి చేస్తూనే సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగాపాల్గొన్నారని. రాజమహేంద్రవరంలో స్త్రీలకు విద్య నేర్పించడం కోసం పాఠశాల, వసతిని ఏర్పాటు చేసారని. కాకినాడ లో 1923లో జరిగిన స్వాతంత్ర్యోద్యమ సభలో పాల్గొని అనర్గళంగా మాట్లాడారని తెలియజేశారు. అప్పట్లో సుబ్బమ్మ చేసిన సేవలకుగాను 'దేశ భాంధవి' అనే బిరుదు ఇచ్చారని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన పోరాట యోధులు చాలా మంది ఉన్నారని.వారిలో కొంతమందికి గుర్తింపు లేదని అటువంటి వారందరిని గుర్తించి వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తానని సభలో యాట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో గంపల వెంకట సోమరాజు, మేడి శెట్టి శ్రీనివాస్, మందాలసత్యనారాయణ, ముద్రగడ శ్రీను, హైదర్ అబ్బాస్, మొహమ్మద్ బాబులు, కొప్పిశెట్టి కొండబాబు, కొండాసత్యనారాయణ తదితరులుపాల్గొని సుబ్బమ్మకు నివాళులర్పించారు.

ద్రాక్షారామలో దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి సభ

సాయిబాబు దంపతులను సత్కరిస్తున్న ఉప కమిషనర్, సహాయ కమిషనర్

'బాలబాలాజీ' ఆలయ ఎసి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం నందు అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి గావిధులు నిర్వహించి శుక్రవారం డి.సాయిబాబు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డి.సాయిబాబు దంపతులను ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి ఆధ్వర్యంలో ఘనం గా సన్మానం చేశారు. ఉప కమిషనర్, ఎం.విజయ రాజు తదితరులు సాయి బాబు దంపతులకు శాలువా కప్పి, నూతన వస్త్రాలు బహూకరించి సన్మానించినారు. కార్యక్రమంలో వివిధ ఆలయా ల కార్యనిర్వహణాధికారులు, ఆలయ అర్చకులు, మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో179 మంది ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

నియామకపత్రం అందుకుంటున్న విద్యార్థిని

అమలాపురం కొంకాపల్లి హెల్పింగ్ జాబ్ ప్లేస్ మెంట్ కార్యాలయం నందు శుక్రవారం అడబాల ట్రస్ట్ ఛైర్మెన్ అడబాల సాయి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 316 మంది ఇంటర్వ్యూకి హాజరుకాగా 179 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాలో డెక్కన్, ఐసిఐసిఐ, డైకిన్, ఫోక్స్ కాన్ ఇలా మొత్తం 13 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ముఖ్య అతిథి గా ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆజాద్ నాగసుధా కొండ హాజరై మాట్లాడుతూ అడబాల ట్రస్ట్ స్థాపించి అడబాల సాయి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. తదుపరి కొందరికి నియామక పత్రాలు అందజేశారు.

'ఇసెట్' ర్యాంకర్ నితిన్‌కు అభినందన

ప్రజాశక్తి-కొత్తపేట

మోడెకుర్రు గ్రామానికి చెందిన గోలకోటి నితిన్ ధనుంజయ కుమార్ ఇసెట్‌లో ఏపీలో స్టేట్ 3వ ర్యాంక్, తెలంగాణలో 4వ ర్యాంక్ సాధించాడని కాంతి భారతి విద్యాసంస్థల డైరెక్టర్ తోట సత్యవాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ నితిన్ ధనుంజయ్‌కుమార్ కాంతి భారతి విద్యాసంస్థల పూర్వ విద్యార్థి అని తెలిపారు. నితిన్‌కు కాంతి భారతి విద్యాసంస్థల డైరెక్టర్ తోట సత్యవాణి, కందికట్ల శ్రీనివాసరావు, డివైవి.శేఖర్, సిహెచ్ సత్యనారాయణ అభినందించారు.

మిడ్డే మీల్స్ వర్కర్లకు శిక్షణ

ప్రజాశక్తి -కరప

కరప నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎంఇఒ కెబి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ అధ్యక్షతన మధ్యాహ్న భోజనం వర్కర్లకు శిక్షణ అందించినట్టు ఎంఇఒ బుల్లి కృష్ణవేణి తెలిపారు. మండలంలో 50 ప్రాథమిక పాఠశాలల్లో ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 జెడ్‌పి హైస్కూల్స్‌లో మొత్తం 64 పాఠశాలల వర్కర్లకు రోజువారీ మెనూ ప్రకారం టీములుగా విభజించి వంటల పోటీలను నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్‌గా జి.గంగాభవాని, సిహెచ్.దుర్గా భవాని, కరప ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణరాణి, ఎంఇఒ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సినీ నటుడు కృష్ణ జయంతి

ప్రజాశక్తి-అమలాపురం

సినీ నటుడు కృష్ణ 81వ జయంతిని స్థానిక రమా థియేటర్ ఆవరణలో అమలాపురం టౌన్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు కొప్పిశెట్టి నరసింహమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కృష్ణ అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ మరియు స్వీట్స్ పంపిణీ నిర్వహించారు. ఈ వేడుకల్లో అమలాపురం పట్టణ సూపర్ స్టార్ కష్ణ అభిమానుల సంఘం గౌరవ అధ్యక్షులు చొల్లంగి రామకృష్ణ, కొప్పాడి రమేష్ బాబు, కాలే గోవింద్, దొమ్మేటి శ్రీను, పాటి రవి, రాయుడు శ్రీను, సాంబయ్య, దంగేటి కనక అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

ధనలక్ష్మి అమ్మవారికి బంగారు ఆభరణాల అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక కాలువ వద్ద ఉన్న శ్రీధనలక్ష్మి అమ్మవారికి మడికికి చెందిన కొడమంచిలి లక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌కు అమ్మవారి సన్నిధిలో బంగారు చెవి దిద్దులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా యాత్రికులకు ఆలయ అర్చకులు మున్నంగి ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'ఆరోగ్య సురక్ష'లో 374 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- మామిడికుదురు

పెదపట్నంలో నగరం పిహెచ్‌సి వైద్యాధికారి కె.స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు డాక్టర్ స్వర్ణలత, అనూషలు సుమారు 374 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పి హెచ్‌సి వైద్య సిబ్బంది సేవలందించారు.

LOST OF PASSPORT

I, **KOTHAPALLI RAMBABU,** S/o. Gopala Krishna Murthy lost my Original Passport No. **G 9662932** issued by passport office Visakhapatnam. Iam coming to office **14-5-2024, 10.00 AM** at unfortunately lost at my office surrounding area Samalkota. Inspite of my best efforts I, could not tracedout . I anybody will be found my said original passport please intimate the same.

KOTHAPALLI RAMBABU
R/o. H.No. 67-5-13/A,
L.B.Nagar Street
Kakinada, Kakinada District

CHANGE OF NAME

I, ADAPA SATISH, S/o VEMULAIAH, Resident of Door No.6-91, BC Colony, Brahmanagudem, Chagallu Mandal, East Godavari District, A.P, PIN :534 301. My **Passport No.E8135506** In My Name is Wrongly mentioned as **ADAPA SATEESH.** So please correct the following mistake in my Passport. I, requrest concerned Passport authorities to renew my Passport.

In the Court of the Principal District Judge, East Godavari at Rajamahendravaram

NOTICE INVITING TENDERS

The Principal District Judge, East Godavari at Rajamahendravaram call for tenders for **43 House Keeping Employees and 2 Supervisors** (Number may increase) to work in the various courts in the District of East Godavari for cleaning of court premises.

Hence interested firms having adequate experience in the relevant field are required to submit their sealed tenders for the under signed.

Last Date for Submission of Tenders is 12-06-2024

Sd/- **SUNITHA GANDHAM**
Principal District Judge

Tender should reach to
The Principal District Judge, East Godavari, Beside Fire Office, Near Gokavaram Bus Stand, Rajamahendravaram.

PUBLIC NOTICE

నా క్లయింట్లు అయిన **సాధేన సీతారత్నం,** W/o. **ఆదినారాయణ,** వయస్సు 66 సం॥లు, 2. **సాధేన సూర్యకుమారి,** W/o. **చింత నాగ సుబ్రహ్మణ్య త్రినాధ్,** రాజమండ్రి వార్లు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియచేయునది ఏమనగా,

నా క్లయింట్లు **30-5-2024 తేదీ** సాయంత్రం 4 గం॥ల సమయంలో రాజమండ్రి గోకవరం బస్టాండ్ వద్ద పడిపోయినవి. వారి ఒరిజినల్ లింకు దస్తావేజులు తాలూకా **Reg. No. 820/1985** దస్తావేజులు మరియు **Reg. No. 720/1985** దస్తావేజులు రెండునూ (1) రావి సరస్వతి గారి పేరున ఉన్నది. (2) పోటాబత్తిన మంగాదేవి గారి పేరున ఉన్నది పడిపోయినవి. కావున ఎవరైనా వాటిని జాగ్రత్త పరచిన యెడల యీ దిగువ తెలిపిన అడ్రస్సు నందు వెంటనే అందచేయవలెను. తగిన పారితోషికము యివ్వబడును. యిందులకు వ్యతిరేకంగా సదరు దస్తావేజులను ఉపయోగించిన వారిపై తగు సివిల్, క్రిమినల్ చర్యలు జరుపబడునని ఈ ప్రకటన పూర్వకంగా యావన్మందికి తెలియచేయడమైనది.

కె.ఎల్.ఆర్.ప్రకాష్
అడ్వకేట్/ నోటరీ
కృష్ణా నగర్, సీతంపేట
రాజమండ్రి
రాజమండ్రి
ది.31-5-24
సెల్: 9849474406